గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలలో వాటర్ ట్యాంక్ ఏర్పాటు

భీంపూర్ పాఠశాలలో వాటర్ ట్యాంక్‌ను ఏర్పాటు చేసిన పంచాయతీ కార్యదర్శి శంకర్

నమస్తే ఎఫెక్ట్

నార్నూర్, ఆగస్టు 28 : భీంపూర్ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో, ఆశ్రమంలో తాగునీటి కట కట అనే శీర్షికతో బుధవారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి పంచాయతీ కార్యదర్శి శంకర్ స్పందించారు. పాఠశాలలో నీటి సమస్య పరిష్కరించే వరకు పంచాయతీ ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తామని ఆయన తెలిపారు. దీంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.

30న ఇంటర్ అడ్మిషన్లకు స్పాట్ కౌన్సెలింగ్

ఎదులాపురం, ఆగస్టు 28 : జిల్లాలోని మూడు సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈ నెల 30వ తేదీన ఆదిలాబాద్ హెడ్ క్వార్టర్స్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల విద్యాలయం సీవోఈలో స్పాట్ కౌన్సెలింగ్ ఉంటుందని గురుకులాల జిల్లా సమన్వయ అధికారి లలితకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్ లోని సీవోఈ కళాశాలలో బాలికలు, బాలురకు, ఉదయం 9 గంటలకు స్పాట్ కౌన్సెలింగ్ ఉంటుందని పేర్కొన్నారు. పదో తరగతి మెమో, టీసీ, కుల, ఆదాయ ధ్రువీకరణ, ఆధార్ కార్డు, బోనాఫైడ్ ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు జిరాక్స్ సెట్లతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు. ఆదిలాబాద్ సీవోఈ బాలికలు ఎంపీసీ–4, బోథ్ బాలికలు బైపీసీ–4, ఇచ్చోడ బాలుర ఎంపీసీ –10, బైపీసీ–9 చొప్పున ఖాళీలున్నాయని తెలిపారు.

క్రికెట్, వాలీబాల్ కిట్ పంపిణీ

బేల, ఆగస్టు 28 : బేలలోని మహాత్మా జ్యోతిబాపూలేలో బుధవారం బీజేవైఎం మండలాధ్యక్షుడు నవీన్ విద్యార్థులకు వాలీబాల్, క్రికెట్ కిట్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు దత్తా నిక్కం, మాజీ సర్పంచ్ ఇంద్రశేఖర్, సందీప్, నారాయణ్, ప్రదీప్ ఖోడే, మహేశ్, అక్షయ్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణపై అప్రమత్తత అవసరం

నార్నూర్, ఆగస్టు 28 : సీజనల్ వ్యాధుల నివారణపై అప్రమత్తత అవసరమని అదనపు డీఎంహెచ్‌వో కుడ్మెత మనోహర్ వైద్య సిబ్బందికి సూచించారు. బుధవారం మండల కేంద్రంతో పాటు తాడిహత్నూర్ ఆరోగ్య ఉపకేంద్రాన్ని తనిఖీ చేశారు. దవాఖానకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దవాఖానకు వచ్చే రోగుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రతి గ్రామంలో పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తూ, వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి రాంబాబు, హెచ్ఈవో నాందేవ్, ఆరోగ్య పర్యవేక్షకుడు చౌహాన్ చరణ్‌దాస్, హెల్త్ అసిస్టెంట్ కైలాస్, సిబ్బంది, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

విద్యుత్ అమరవీరుల సంస్మరణ సభ

ఎదులాపురం, ఆగస్టు 28 : ఆదిలాబాద్‌లోని సుందరయ్య భవనంలో సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం విద్యుత్ అమర వీరుల సంస్మరణ సభను నిర్వహించారు. వారికి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనల మల్లేశ్, నాయకులు ఆశన్న, లింగాల చిన్నన్న, అగ్గిమల్ల స్వామి, చిల్ల సుజాత, ప్రశాంత్ పాల్గొన్నారు.

రిమ్స్‌లో రెండో రోజూ ఎంబీబీఎస్ అడ్మిషన్లు

ఎంబీబీఎస్ విద్యార్థికి అడ్మిషన్ ఆర్డర్ అందజేస్తున్న రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్

ఎదులాపురం, ఆగస్టు 28: ఆదిలాబాద్ రిమ్స్‌లో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం ఆల్ ఇండియా కోటా అడ్మిషన్లు రెండో రోజూ బుధవారం కొనసాగాయి. రిమ్స్ వైద్యకళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరంలో 120 సీట్లు ఉండగా ఆల్ ఇండియా కోటా కింద జాతీయ వైద్య మండలి దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు 15 సీట్లు కేటాయించింది. ఇప్పటి వరకు ఐదుగురు అడ్మిషన్లు తీసుకోగా నేడు చివరి రోజు మిగతా విద్యార్థులు సైతం కళాశాలలో చేరే అవకాశం ఉందని సిబ్బంది తెలిపారు. రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్ విద్యార్థులకు అడ్మిషన్ అర్డర్లు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ అశోక్, సిబ్బంది రాకేశ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ దవాఖాన సందర్శన


కేంద్రీయ బృందం ప్రతినిధులతో వైద్య సిబ్బంది

నార్నూర్, ఆగస్టు 28 : నార్నూర్‌లోని సామాజిక ఆరోగ్య కేంద్రంతో పాటు జిల్లా రిమ్స్, ఉట్నూర్ ప్రభుత్వ దవాఖానలను కేంద్రీయ బృందం ప్రతినిధులు బుధవారం సందర్శించారు. మండల కేంద్రంలోని వైద్యాధికారులు, వైద్య సిబ్బందితో సమీక్షించారు. దవాఖాన పరిధిలోని ప్రసవాల విభాగం, మదర్ కేర్ యూనిట్లను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు, నవజాతిశిశువులకు వైద్యం అందిస్తున్న తీరును వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేంద్రీయ బృందం ప్రతినిధులు అమ్లిన్‌శుక్లా, ధనిగైనాథన్ మాట్లాడుతూ నవజాతి శిశు మరణాల కట్టడికి అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు రాంబాబు, జితేంద్ర రెడ్డి, రాథోడ్ ప్రవీణ్, మనోజ్, మోహన సుందరి, సత్య సాయిప్రసాద్, అంజలి, లక్ష్మి, చరణ్‌దాస్, విలాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు తనిఖీ

తాంసి(భీంపూర్), ఆగస్టు 28: భీంపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం సీడీపీవో తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఇక్కడ ఏసీడీపీవో నర్సమ్మ, సూపర్‌వైజర్ ముంతాజ్, రాధ, అంగన్‌వాడీలు సుజాత, ప్రియ ఉన్నారు.

మెరుగైన విద్యను అందించాలి

ఇంద్రవెల్లి: వంటలను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా

ఇంద్రవెల్లి, ఆగస్టు 28 : విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా ఉపాధ్యాయులకు ఆదేశించారు. బుధవారం పిట్ట బొంగురం గ్రామ పంచాయతీ పరిధిలోని పాటగూడ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్‌ను ఆమె తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న విద్య, వైద్యం, భోజనంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల అటెండెన్స్‌తో పాటు నిత్యావసర సరుకుల రికార్డును పరిశీలించారు. ప్రతిరోజూ వంటగదితో పాటు స్టోర్ రూం, తాగునీటి, మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆమె వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

గిరివికాసం రైతులకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వండి

ఉట్నూర్, ఆగస్టు 28: గిరిజన రైతుల భూములకు విద్యుత్, మోటర్లు బిగించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా అన్నారు. బుధవారం ఉట్నూర్‌లోని పీవో క్యాంపు కార్యాలయంలో విద్యుత్ శాఖ, డీఆర్డీవో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరివికాసం పథకం కింద గిరిజన రైతుల భూములకు విద్యుత్ కనెక్షన్, మోటర్, పైపుల సౌకర్యం వెంటనే కల్పించాలన్నారు. అలాగే అటవీ శాఖ నుంచి ఎటువంటి సమస్యలున్న తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో వసంత్‌రావు, ఎస్‌వో సురేశ్, గిరివికాసం కోఆర్డినేటర్ ప్రసాద్ పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గంగారెడ్డి

నిర్మల్ అర్బన్, ఆగస్టు 28 : నిర్మల్ జిల్లాలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగను పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం నిర్మల్‌లోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ గంగారెడ్డి వివరాలు వెల్లడించారు. హర్యానా రాష్ట్రానికి చెందిన మహ్మద్ అబ్బాస్ 15 సంవత్సరాల క్రితం నిర్మల్‌కు వచ్చి గాజుల్‌పేట్ కాలనీలో నివాసముంటున్నాడు. ఇక్కడే స్థిరపడి 13 సంవత్సరాల క్రితం వివాహం చేసుకుని ఐదుగురు పిల్లలను కన్నాడు. కూరగాయల దుకాణంలో పని చేసుకుంటూ చిన్నచిన్న దొంగతనాలకు పాల్పడుతున్నాడు. ఈ క్రమంలో ఇటీవల ఖిల్లాగుట్ట, సోమవారిపేట్, పింజారిగుట్ట, కురన్నపేట్‌లో గత ఏడాది అక్టోబర్‌లో జల్సాలకు అలవాటు పడి పది దొంగతనాలు చేసి తప్పించుకుని తిరుగుతున్నాడు. క్లూస్ టీం సభ్యులు దొంగతనం చేసిన చోట మహ్మద్ అబ్బాస్ వేలిముద్రలు దొరకడంతో నిందితుడి కోసం పోలీసులు గాలించారు. ఇందుకోసం ప్రత్యేక టీం హర్యానా రాష్ట్రం, నాందేడ్ పోలీసులు సహకారంతో హర్యానా నుంచి ఇక్కడికి వచ్చి స్థిరపడిన వారిని విచారించారు. అబ్బాస్ దొంగతనాలకు పాల్పడుతున్నాడని తెలుసుకుని చాకచక్యంగా పట్టుకుని ఇతని వద్ద నుంచి 150 గ్రాముల గంజాయి, 2 తులాల బంగారం, 20 తులాల వెండిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. దొంగలను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన టౌన్ సీఐ ప్రవీణ్ కుమార్, రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్ఐలు రమేశ్, సాయికృష్ణ, రవి, గోపి నేతృత్వంలో సాకత్ హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ తిరుపతి, గణేశ్, హోంగార్డు సతీశ్‌ను ఎస్పీ జానకి షర్మిల అభినందించారు. సమావేశంలో సీఐ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

విద్యారంగానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వం

నిర్మల్ అర్బన్, ఆగస్టు 28: కేంద్ర ప్రభుత్వం విద్యారంగానికి వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నదని ఏఐపీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు అనిల్, మన్నెకుమార్ అన్నారు. బుధవారం నిర్మల్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి విద్యార్థి సంఘం పోరాడుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పలువురు సభ్యులు విద్యార్థి సంఘంలో చేరారు. వారికి కండువాను కప్పి సంఘంలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు రవి, సాయికుమార్, విద్యార్థి నాయకులు ఆనంద్, రిషిత్‌గౌడ్, ప్రవీణ్, లక్ష్మణ్, రాజేందర్, శ్రీకాంత్, శ్రీకర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎన్‌సీసీ ఎంపిక పోటీలు

నిర్మల్ అర్బన్, ఆగస్టు 26: నిర్మల్‌లోని కస్బా ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం ఎన్‌సీసీ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మిలటరీ అధికారి నాయబ్ సుబేదార్, రమేశ్ కుమార్ విద్యార్థులకు ఎంపిక పరీక్షలను నిర్వహించారు. విద్యార్థులకు ఎన్‌సీసీ ప్రాధాన్యత వివరించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి సాయన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మికులకు వేతనాలు వెంటనే చెల్లించాలి

నిర్మల్ అర్బన్, ఆగస్టు 28 : నిర్మల్ మున్సిపల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులకు వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం విధులను బహిష్కరించారు. గాంధీపార్కులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు నెలల వేతనాలు, పీఎఫ్ డబ్బులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

అర్హులకు గృహజ్యోతి వర్తింపు

బజార్‌హత్నూర్, ఆగస్టు 28 : అర్హులైన ప్రతి ఒక్కరికీ గృహజ్యోతి వర్తిస్తుందని విద్యుత్ శాఖ డీఈ విజయ్‌సారిథి అన్నారు. బుధవారం బజార్‌హత్నూర్‌లోని పాత బస్టాండ్ సమీపంలో గ్రామస్తులతో గృహజ్యోతిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెల్లరేషన్‌కార్డు ఉండి దరఖాస్తు చేసుకున్న సాంకేతిక కారణాలతో లబ్ధిపొందలేని వినియోగదారులకు ప్రభుత్వం సరిచేసుకునే అవకాశం కల్పించిందని ఎంపీడీవో కార్యాలయంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలోడీపీ ఏఈలు రవీందర్, యోగేశ్, మండల విద్యుత్ అధికారి శ్రీనివాస్, లైన్‌మెన్ సాయి, గ్రామస్తులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

అవగాహన కల్పిస్తున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య

ఎదులాపురం, ఆగస్టు 28 : రాజ్యాంగంలో పొందుపరిచిన చట్టాలు, వాటి పని తీరుపై విద్యార్థి దశ నుంచే అవగాహన పెంపొందించుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య విద్యార్థులకు సూచించారు. బుధవారం ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గణేశ్ సింగ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కోనేరు ప్రతిష్ఠాపన మహోత్సవం

ఎదులాపురం, ఆగస్టు 28 : ఆదిలాబాద్‌లోని ప్రసిద్ధ బెల్లూరి అయ్యప్ప స్వామి ఆలయంలో కోనేరు ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు మూర్తి గురుస్వామి, ప్రథమ అర్చకులు సంతోష్ కుమార్ శర్మ ప్రత్యేక పూజలు చేశారు. తొమ్మిది పవిత్ర నదుల నుంచి ప్రత్యేకంగా సేకరించిన పవిత్ర నది జలాలతో జల ప్రతిష్ఠ జరిపిన అనంతరం స్వామి వారికి చక్రస్నానం నిర్వహించారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ ప్రత్యేక పూజల్లో పాలు పంచుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు దారట్ల జీవన్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కుంబోజి సూర్యకాంత్, రవీందర్, నగేశ్ పాల్గొన్నారు.

చెరువులో చేప పిల్లలు విడుదల

జైనథ్, ఆగస్టు 28 : జైనథ్ లక్ష్మీనారాయణ స్వామి చెరువులో జిల్లా మత్స్యశాఖ ద్వారా వచ్చిన చేప పిల్లలను బుధవారం మండల పీహెచ్‌సీ డాక్టర్ నైనత, సీహెచ్‌వో అంజయ్య వదిలి పెట్టారు. కార్యక్రమంలో జైనథ్ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఖాజా ముజీబ్‌మొద్దీన్, ఏఎన్ఎంలు, మత్స్యకారులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

సోన్, ఆగస్టు 28 : సోన్ మండలంలోని లెఫ్ట్ పోచంపాడ్ తెలంగాణ సోషల్ వెల్ఫేర్ జూనియర్ ఇంటర్మీడియట్ కళాశాలలో హెచ్ఈసీ గ్రూపులో అడ్మిషన్ పొందుటకు ఒక రోజు చివరి అవకాశం ఉందని నిర్మల్ జిల్లా సమన్వయకర్త ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. 2024 పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థినులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో అడ్మిషన్ పొందే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ప్రభుత్వ ఏరియా దవాఖానకు సామగ్రి అందజేత

ఏరియా దవాఖానకు బెడ్‌లను అందిస్తున్న ముథోల్ ఎమ్మెల్యే రామరావు పటేల్

భైంసా, ఆగస్టు 28 : భైంసాలోని ప్రభుత్వ ఏరియా దవాఖానకు ఎమ్మెల్యే రామారావు పటేల్ జన్మదినం సందర్భంగా ఆయన కుమారులు డాక్టర్ సతీశ్ పవార్, సందీప్ పవార్ రూ.12 లక్షల సామగ్రిని బుధవారం అందజేశారు. 10 ఐసీయూ బెడ్స్, 15 జనరల్ బెడ్స్, 10 మల్టీ పారామీటర్స్, 10 బెడ్‌సైడ్ లాకర్స్, వీల్‌చైర్ స్ట్రెచర్, 30 మంది ఔట్ పేషంట్లు కూర్చొనే సీట్లను అందజేశారు. కార్యక్రమంలో ఏరియా దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ కాశీనాథ్, వైద్యులు, నాయకులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

కుభీర్, ఆగస్టు 28 : మండలంలోని పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ సూచించారు. కుభీర్‌లో నిర్మించిన ఆద్యా హాస్పిటల్‌ను నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. మారుమూల మండలంలో అన్ని సౌకర్యాలతో కూడిన దవాఖానను నిర్మించిన వైద్యుడు పేండ్కర్ సంతోష్, డాక్టర్ పీ శివరాం, దీపాశ్రీలను ఆయన అభినందించారు. వైద్యులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. అంతకు ముందు ఆయన శ్రీ విఠలేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ పూజారి ప్రమోద్ జోషి, నాయకులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ గ్రూపింగ్ ప్రారంభం

కుంటాల, ఆగస్టు 28: మండలంలో 2 లక్షలు పంట రుణం మాఫీ కానీ రైతుల కుటుంబ నిర్ధారణ కార్యక్రమం మొదలుపెట్టినట్టు ఏవో అస్రం రవి అన్నారు. కుటుంబ సభ్యుల ఆధార్‌కార్డులు, పట్టా పాస్‌బుక్, డిక్లరేషన్లను ఏఈవోలకు అందజేయాలని కోరారు. భార్యభర్తల హాజరు తప్పనిసరి, అధికారితో కుటుంబం సెల్ఫీ దిగాల్సి ఉంటుందని పేర్కొన్నారు. 29న అంబకంటి, దౌనెల్లి, 30న విట్టాపూర్, పెంచికల్‌పాడ్, 31న కల్లూర్, అందకూర్, సెప్టెంబర్ 1న ఓలా, 2న ఓలా, లింబా(కే), లింబా(బీ), 4న సూర్యాపూర్, మెదన్‌పూర్, అంబుగాం, రాజాపూర్‌లో ఫ్యామిలీ గ్రూపింగ్ ఉంటుందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో హర్షిత మండల కేంద్రానికి చెందిన పలువురు రైతు కుటుంబాలను గ్రూపింగ్ చేశారు. ఇక్కడ ఏఈవోలు శ్రీనివాస్, పవన్, గణేశ్ ఉన్నారు.

చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దు

భైంసాటౌన్, ఆగస్టు 28 : అనుకొని సంఘటనలు జరిగినప్పుడు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా పోలీసులకు సమాచారం అందించాలని ఏఎస్పీ అవినాశ్ కుమార్ అన్నారు. బుధవారం భైంసా రూరల్ పోలీస్ స్టేషన్‌లో సీఐ నైలు, ఎస్ఐ శ్రీనివాస్‌యాదవ్‌తో కలిసి గతంలో నేర చరిత్ర కలిగిన అనుమానితులు, డీజే నిర్వాహకులు, గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోటి వారికి ఇబ్బంది కలగకుండా గణేశ్ నవరాత్రోత్సవాలు నిర్వహించుకోవాలన్నారు. నేరచరిత్ర కలిగిన వారు గ్రామంలో ఎటువంటి సంఘటన జరిగిన వెంటనే పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలన్నారు. బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీషీట్ తెరిచినప్పటి నుంచి పది సంవత్సరాల వరకు (కుటుంబ సభ్యులకు ఎవరికి కూడా నేర చరిత్ర లేకపోతే) సత్ప్రవర్తన కలిగిన వారిని రౌడీషీట్ నుంచి పేరును తొలగించే ప్రయత్నం చేస్తామన్నారు. సమావేశంలో పలు గ్రామాల మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఇథనాల్ పరిశ్రమ వల్ల ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు

నిర్మల్ చైన్‌గేట్, ఆగస్టు 28: ఇథనాల్ పరిశ్రమ వల్ల ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం దిలావర్‌పూర్, గుండంపల్లి, గ్రామాల రైతులు, విద్యావంతులు, ప్రజలు, పరిశ్రమ ప్రతినిధులు, సంబంధిత శాఖాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇథనాల్ పరిశ్రమపై రెవెన్యూ, నీటిపారుదల, అటవీ శాఖాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి శాస్త్రీయంగా అధ్యయనం చేయాలని ఆదేశించారు. ఇటీవల ఆందోళన చేసిన వారి వాహనాలు జప్తు చేయడంతో పాటు పలువురిపై కేసులు నమోదు చేశారని గ్రామస్తులు కలెక్టర్‌కు విన్నవించారు. పోలీసు శాఖ అధికారులతో చర్చించి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హామీ ఇచ్చారు. పరిశ్రమపై మహిళలు, రైతులు, విద్యావంతులు, యువత సందేహాలను ప్రశ్నలను లిఖిత పూర్వకంగా తహసీల్దార్ స్వాతికి అందించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, డివిజనల్ అటవీ శాఖాధికారి షేక్ ఆదాం నాగిని భాను, డీఆర్వో భుజంగరావు, డీపీవో శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, డీఎంహెచ్‌వో రాజేందర్, దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామస్తులు, రైతులు, విద్యావంతులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలి

జైనథ్, ఆగస్టు 28 : మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి రాథోడ్ నరేందర్ అన్నారు. బుధవారం మేడిగూడ(ఆర్) హెల్త్ సబ్ సెంటర్‌ను డీఐవో తనిఖీ చేశారు. పరిసరాలను పరిశీలించారు. జాతీయ ఆరోగ్య పథకం అమలు డ్రై డే కార్యక్రమాలను పరిశీలించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఐవో వైస్ శ్రీనివాస్, గిమ్మా పీహెచ్‌సీ డాక్టర్ సుచల, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

31న జాబ్‌మేళా

ఎదులాపురం, ఆగస్టు 28 : ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించుటకు ఈ నెల 31వ తేదీన ఆదిలాబాద్‌లోని సాత్నాల క్వార్టర్స్‌లో గల జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కె.మిల్కా ఒక ప్రకటనలో తెలిపారు. ఈకామ్, ఎక్స్‌ప్రెస్ కంపెనీలో డెలివరిబాయ్, విద్యార్హత పదో తరగతి అపై ఉన్న 18 నుంచి 40 సంవత్సరాల లోపు గల పురుషులు అర్హులు అని పేర్కొన్నారు.

కేజీబీవీకి వంటపాత్రల వితరణ

కుభీర్, ఆగస్టు 28: కుభీర్‌లోని కేజీబీవీకి రూ.6వేల విలువ చేసే వంటపాత్రలను వ్యాపారి ఆర్ సంతోష్ ఎస్‌వో వాణికి అందజేసి ఉదారతను చాటుకున్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, పండరి, గ్రామస్తులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఆదిలాబాద్ ఎంపీ

మంత్రితో మాట్లాడుతున్న ఎంపీ నగేశ్

ఎదులాపురం, ఆగస్టు 28 : ఆదిలాబాద్ ఎంపీ నగేశ్ బుధవారం హైదరాబాద్‌లో రాష్ట్ర రోడ్డు భవనల శాఖ మంత్రి కొమటిరెడ్డి వెంకటరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో గల ఆర్అండ్‌బీ రోడ్డు పనుల పురోగతి, అటవీ శాఖ అనుమతులు, నూతనంగా మంజూరు చేయాల్సిన రోడ్డు పనుల గురించి చర్చించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేయాలని కోరారు. స్పందించిన మంత్రి నిలిచిపోయిన పనులు, కొత్తగా అవసరమైన వంతెనలు, రోడ్డు పనుల ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను అదేశించారు. అటవీ అనుమతుల కోసం వివరాలు త్వరగా తయారు చేసి పంపాలని అటవీ శాఖ అధికారులు సూచించినట్లు తెలిపారు.

విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలి

ఇంద్రవెల్లి, ఆగస్టు 28: వసతి గృహాల్లో ఉండి చదువుకుంటున్న విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని డీఆర్డీవో సాయన్న అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బీసీ వసతి గృహంతో పాటు కేజీబీవీని డీఆర్డీవో తనిఖీ చేశారు. వసతి గృహాలతో పాటు సిబ్బంది హాజరు పరిశీలించారు. మౌలిక సదుపాయాలతో పాటు సౌకర్యాలు, భోజనం, దుప్పట్లు, కాస్మోటిక్ వస్తువుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య పనులు చేసి శుభ్రతను పాటించాలన్నారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

స్పందించిన కలెక్టర్.. పిల్లలను చేరదీసిన అధికారులు

పిల్లలను చేరదీసిన బాలరక్షక టీం అధికారులు

నిర్మల్ చైన్‌గేట్, ఆగస్టు 28: సారంగాపూర్ బస్టాండ్ ఆవరణలో కొంత కాలంగా మతిస్థిమితం కోల్పోయిన మహిళతో పాటు ఇద్దరు పిల్లలు ఉంటున్నట్లు జాం గ్రామానికి చెందిన బీజేపీ సోషల్ మీడియా కన్వీనర్ తిరుమల చారి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌కు ట్వీట్ చేశారు. కలెక్టర్ వెంటనే స్పందించి బాలరక్షక్ టీం సంబంధిత ప్రాంతానికి పంపి రెస్క్యూ చేయించారు. ఎనిమిదేళ్ల ఉన్న పాపను స్వర్ణ పాఠశాలలో అడ్మిన్ చేస్తామని తెలిపి, తల్లి, బిడ్డను ప్రస్తుతం బాలసదనానికి తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. తాను చేసిన ట్వీట్‌కు స్పందించి తక్షణమే చర్యలు తీసుకున్న కలెక్టర్‌కు తిరుమలచారి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సారంగాపూర్ మాజీ సర్పంచ్ చంద్రప్రకాశ్‌గౌడ్, దొడ నర్సయ్య, భూమేశ్, శ్రీకాంత్, జిల్లా బాల సంరక్షణ అధికారి దేవి మురళి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి, ప్రొటెక్షన్ ఆఫీసర్ రాజు, చైల్డ్‌లైన్ కో ఆర్డినేటర్ నల్ల గంగాధర్, కేస్‌వర్కర్ కవిత, ఔట్ రీచ్ వర్కర్ మమత, అంగన్‌వాడీ టీచర్ రాజ్యలక్ష్మి ఉన్నారు.

రుణమాఫీ కాని రైతులు దరఖాస్తు చేసుకోవాలి

ఇచ్చోడ, ఆగస్టు 28: సాంకేతిక కారణం, రేషన్ కార్డు లేని రైతులు వ్యవసాయ అధికారుల వద్ద దరఖాస్తు చేసుకోవాలని ఇచ్చోడ ఏవో జాదవ్ కైలాస్ అన్నారు. బుధవారం జున్ని, దాబా గ్రామాల్లో సర్వే నిర్వహించారు. రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. కార్యక్రమంలో ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

సిరికొండలో బంద్ సంపూర్ణం

ఇచ్చోడ(సిరికొండ), ఆగస్టు 28: ఆదివాసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తుడుందెబ్బ, ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో సిరికొండలో ఏజెన్సీ బంద్ బుధవారం ప్రశాంతంగా ముగిసింది. ఆదివాసీ నాయకులు తెరిచి ఉన్న దుకాణాలను మూసివేయించారు. జీవో నంబర్.3 యథావిధిగా కొనసాగించాలని, ఏజెన్సీలో ప్రత్యేక డీఎస్సీ వేయాలని ఆదివాసీ నాయకులు అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు కృష్ణ, భీంరావ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ముథోల్, ఆగస్టు 28 : ముథోల్‌లోని సాయిమాధవ్ నగర్, నాయబాది కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని బుధవారం కాలనీ వాసులు ఎంపీడీవో శివకుమార్, పంచాయతీ ఈవో ప్రసాద్ గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక వర్షపు నీరు రోడ్లపై నిలిచి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని నిలువ ఉన్న నీటిలో దోమలు చేరి ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని తెలిపారు. అధికారులు స్పందించి రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. సాయిమాధవ్ నగర్ కాలనీవాసులు పాల్గొన్నారు.

బార్ అండ్ రెస్టారెంట్‌లో దొంగతనం

నిర్మల్ అర్బన్, ఆగస్టు 28 : నిర్మల్‌లోని సోఫినగర్ కాలనీలో గల సాయివైష్ణవి బార్ అండ్ రెస్టారెంట్‌లో మంగళవారం రాత్రి దొంగతనం జరిగింది. యజమాని బుధవారం ఉదయం వచ్చి చూసే సరికి షటర్ తాళాలు పగుల గొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా సీసీ కెమెరాలు ధ్వంసం చేసి అక్కడ ఉన్న వస్తువులను చిందరవందరగా పడేశారు. కౌంటర్‌లో ఉన్న దాదాపు రూ.40 వేల నగదు, బ్రాండెడ్ కంపెనీల మద్యం అపహరించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా అక్కడికి చేరుకొని సీసీ కెమెరాలను పరిశీలించారు. నలుగురు దొంగలు ఈ దొంగతనానికి పాల్పడినట్లు సీసీ పుటేజ్‌లో నమోదైన రికార్డుల ద్వారా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురికి గాయాలు

నిర్మల్ అర్బన్, ఆగస్టు 28 : నిర్మల్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. సారంగాపూర్ మండలం జాం గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు బైక్‌పై నిర్మల్ వైపు వెళ్తున్నారు. నిర్మల్ నుంచి గండిరామన్న ఆలయం వైపు వెళ్తున్న ఆటో బైక్‌ను ఢీ కొట్టింది. బైక్‌పై ప్రయాణిస్తున్న రంగుల రమణ, తోకల శ్రీనివాస్‌తో పాటు మరో యుకుడికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గాయాలైన వారికి ప్రాథమిక చికిత్స చేసి దవాఖానకు తరలించారు.

బోథ్, ఆగస్టు 28: బోథ్– కిన్వట్ అంతర్రాష్ట్ర రహదారిపై కౌఠ(బీ) గ్రామ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించిన వివరాలు... నిర్మల్‌కు చెందిన వారు ద్విచక్రవాహనంపై సొనాల వైపు వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ద్విచక్రవాహనం ఢీ కొట్టడంతో ముజ్జశీల హిమత్, పూనవ్, ప్రజ్ఞ కింద పడిపోవడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 వారు వీరిని ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తీసుకెళ్లారు. పూర్తి వివరాలు అందాల్సి ఉందని ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేసిన యువకుడి అరెస్టు

ఎదులాపురం, ఆగస్టు 28 : ఓ మాతాన్ని కించపరిచే విధంగా ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేసిన యువకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. మంగళవారం వన్ టౌన్ పరిధిలోని శాంతినగర్‌కు చెందిన యువకుడు ఓ మాతానికి సంబంధించిన ఫొటోను అసభ్యకరంగా చేసి వాటిని ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేయగా అతడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

మహిళ అదృశ్యం

గంగుబాయి

తాంసి(భీంపూర్), ఆగస్టు 28: భీంపూర్ మండలం తాంసి(కే) గ్రామానికి చెందిన మహిళ అదృశ్యమైన ఘటన బుధవారం వెలుగు చూసింది. పోలీసుల వివరాల ప్రకారం.. తాంసి(కే) గ్రామానికి చెందిన ఆత్రం సందీప్ గుంగుబాయి దంపతులు మంగళవారం గొడవ పడ్డారు. భర్తభార్యను కొట్టాడు. దీంతో సాయంత్రం 4.40 గంటలకు గంగుబాయి ఇంటి నుంచి వెళ్లిపోయింది. తండ్రికి విషయం తెలియడంతో వెంటనే చుట్టుపక్కల, బంధువులకు సమాచారం చేరవేసిన ఫలితం లేకపోయింది. అల్లుడు అక్రమ సంబంధం పెట్టుకొని కూతురిని కొట్టడంతోనే ఇంట్లో నుంచి వెళ్లిపోయి ఉంటుందని తండ్రి మడావి భగవాన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కలీం తెలిపారు.

మాజీ జడ్పీటీసీ మృతి


ఉయిక సీతారాం(ఫైల్)

ఇచ్చోడ(సిరికొండ), ఆగస్టు 28: సిరికొండ మండలంలో నారాయణపూర్ గ్రామానికి చెందిన ఇచ్చోడ, సిరికొండ ఉమ్మడి మండల జడ్పీటీసీ ఉయిక సీతారాం(45) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. సీతారాం భార్య ఈశ్వరిబాయి ఇటీవల నారాయణ్‌పూర్ సర్పంచ్‌గా పదవీ విరమణ పొందారు. అనారోగ్యంతో జడ్పీటీసీ మృతి చెందడంతో ఉమ్మడి మండలంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

రుణమాఫీ చేయకపోతే గ్రామాల్లో నిరాహార దీక్షలు

చాతలో మాట్లాడుతున్న రుణమాఫీ కానీ రైతులు

కుభీర్, ఆగస్టు 28: రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన రూ.2లక్షల రుణమాఫీ హామీని తక్షణం అమలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. బుధవారం చాత గ్రామంలో పలువురు రైతులు రోడ్డుపై కాంగ్రెస్, రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రుణమాఫీ చేయకపోతే గ్రామాల్లో నిరాహార దీక్షలకు వెనుకాడేది లేదని హెచ్చరించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఎదులాపురం, ఆగస్టు 28 : తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఓ భోజన్న, ప్రధాన కార్యదర్శిగా జాదవ్ కవిత, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చందు, కోశాధికారిగా ఎల్ కేశవ్, ఉపాధ్యక్షులుగా ప్రదీప్, భారత్, దర్శన్, అనిల్, రాకేశ్, రవికాంత్ రెడ్డి, అధికార ప్రతినిధిగా సోమన్న, మహిళా విభాగం అధ్యక్షురాలుగా మమత, రత్నరెడ్డి, ప్రచారకార్యదిర్శగా ఆర్ వెంకన్న, మీడియా ఇన్‌చార్జి కార్యదర్శిగా సురేందర్‌తో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.